
# నరుడా... నిద్ర లే!

- పసుపులేటి తాతారావు

ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ

భూనభోంతరాళాలు దద్దరిల్లేలా ఫెటిల్లున విస్ఫోటనం! బ్రహ్మాండ పర్వంతమైన హిమవత్పర్వతం తనలోని చిన్న మంచు ఖండాన్ని తనకక్కర్లేదని విసిరేస్తే, భారమని జారవిడిస్తే, అలిగి సముద్రగర్భంలోకి దూసుకుపోయిన 'గ్లేసియర్'! అనంతాంబుధిలో అల్లకల్లోలం. పరస్పర వ్యతిరేక దిశల్లో సెంట్రీఫ్యూగల్, సెంట్రిఫోకల్ బలాలు కలయికతో కకావికలైన జలాలు. గ్రావిటేషన్ ఫోర్స్‌ని ధిక్కరించి తాడి యెత్తున ఎగసిపడిన తరంగాలు.

ఒక కెరటం రివ్వున వచ్చి ముఖాన్ని ఛెళ్ళున తాకినట్టయి ఉలిక్కిపడి నిద్ర లేచాడు జగదీశ్. ముఖానికి పట్టిన చిరుచెమటని తుడుచుకున్నాడు. అదిరిపడే గుండెని అదిమి పట్టుకున్నాడు. ఎంత భయంకరమైన పీడకల! సైన్స్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చదివినా, తెల్లవారుఝామున వచ్చే కలలు నిజమౌతాయన్న నమ్మకం అతనిది. అందుకే కలవరపడ్డాడు.



'ఇంత కలవరం ఎందుకు కలుగుతోంది నాకు?' అనుకుంటూ తలగడ కింద దాచిన రిమోట్ తీసి దృష్టి మళ్ళింపు కోసం టీవీ ఆన్ చేసాడు.

''కళ్ళుండీ చూడలేని వారికీ, చెవులుండీ వినలేని వారికీ కలవరం కాక మరేముంటుంది నాయనా?''

ఎవరో స్వామీజీ ఉపన్యాసం ఇస్తూ అంటున్న మాట అది. జగదీశ్ అదిరి పడ్డాడు. చిత్రంగా తన మనసులోని మాటకి అది సమాధానంలా తోచిందేమో అమితంగా ఆశ్చర్యపోయాడు.

కరెంట్ పోయింది. టీవీ ఆగిపోయింది.

నెమ్మదిగా లేచి బయటికి నడిచాడు. తూర్పున వెలుగు రేఖలు పరమకోడానికి అప్పుడే సంసిద్ధమౌతున్నాయి. ఆకాశంలో దట్టంగా అలుముకున్న మబ్బులు ఉండుండి వీచే చల్లని గాలికి దూదిపింజల్లా ఊగిసలాడుతున్నాయి. తెల్లని పక్షులు రెక్కలల్లల్లాడించుకుంటూ ఏ దూర తీరాలకో శాంతి సందేశాన్ని మోసుకుపోతున్న దూతల్లా దూసుకుపోతున్నాయి. ఎప్పుడు మేల్కొన్నాయో లతలు అప్పుడే పుష్పించడం ప్రారంభించాయి. పుష్పించడమే తడవుగా హిమబాష్ప స్నానాలతో పులకించి పోతున్నాయి సుమ బాలలు. ప్రకృతి పరవశంతో మైమరచిపోతోంది. చూసి తరించడానికి దేవుడిచ్చిన చక్షుద్వయం చాలడం లేదు.

భయంకరమైన కల కలిగించిన కలవరపాటుని తగ్గించుకునే ప్రయత్నంలో ఆకాశం అంచులకి దృష్టిని సారించాడు. అక్కడ, ఐనోస్పియర్ కావల, అనంత విశ్వాంతరాళ పరలోకాల నుండి శరవేగంతో దూసుకువస్తోన్న అతి నీల లోహిత కిరణాలను అడ్డగించి లోనికి రానీయకుండా అహరహం కాపలా నేనున్నానని అభయమిస్తున్న 'ఓజోన్ పొర'! - అతని కంటికి కనిపించలేదు. ఎందుకంటే అతని కళ్ళను కప్పిన పొర కూడా ఒకటుంది మరి!

అప్రయత్నంగా అతని కాళ్ళు డాబామీదకి దారితీసాయి. గిలిగింతలు పెట్టే చల్లగాలీ, ప్రభాత కాంతుల సోయగాలు, విహంగ జీవాల కిలకిలా రావాలు... ప్రకృతి శోభాయమానంగా ఉంది. అల్లంత దూరంలో విశ్రాంతి నెరుగని వీరుల్లా ధీరోదాత్తంగా నిలబడి తలలూపుతున్న వృక్షాలు. క్షణమైనా నడుము వాల్చడానికి నోచుకోని శాపగ్రస్తులు! వాటిని చూడగానే చిన్నప్పుడు చదువుకునే రోజుల్లో తెలుగు మాస్టారు పదే పదే ఇచ్చిన లెక్చరు గుర్తొచ్చిందతనికి.

'త్రాగే నీరు, తినే తిండి, పీల్చే గాలీ... అన్నిటికీ వృక్షమే శ్రీరామ రక్ష. మన జీవం, జీవనం అన్నీ వృక్ష సంపద మీదే ఆధారపడి ఉన్నాయి. దాన్నే మనం నిర్దాక్షిణ్యంగా నరికేస్తున్నాము. బదులుగా చిన్న మొక్కనైనా నాటడం లేదు. ఇది మనందరం చేస్తున్న ఘోరమైన నేరం...'' జగదీశ్ చిన్నగా నవ్వుకున్నాడు. ఆ రోజుల్లో ఐతే పెద్దగానే నవ్వాడు. తోటి పిల్లలతో కూడా నవ్వించాడు. మాస్టారు చూడకుండా.

''కళ్ళుండీ చూడలేని వారికీ, చెవులుండీ వినలేని వారికీ...'' స్వామీజీ మాట అతని చెవుల్లో ఇంకా మారుమోగుతూనే ఉంది.

క్రిందకి వచ్చేసాకా రిఫ్రిజిరేటర్ తెరిచి మంచినీళ్ళ సీసా తీసి గడగడా తాగేసాడు. ఫ్రిజ్‌లోని శీతలీకరణ యంత్రం భూతల వినాశకర విధ్వంసానికి మంత్రం అన్న సంగతి అతనికి తెలియనిది కాదు. భవిష్య తరాల వెయ్యేళ్ళ వినాశనం తాను బ్రతికే మూణ్ణాళ్ళ ముచ్చటకి సాటిరాదు. వాళ్ళెవరో, తానెవరో. తన సుఖంకన్నా వాళ్ళ మనుగడ తనకెంత మాత్రం ముఖ్యం కాదు. స్వార్థం... స్వార్థం... స్వార్థం...

హాల్లోకి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. పోయిన కరెంటు తిరిగొచ్చి టీవీ స్క్రీన్ తళుక్కున మెరిసింది. కాలుష్య నివారణ సంస్థ ఉన్నతాధికారితో ఇంటర్వ్యూ. ''రెండువేలమూడులో నిప్పులు చెరిగి, యూరప్ ఖండాన్ని గడగడలాడించి, ఇరవై వేల మందిని కబళించిన వేసవికి, అదే సమయంలో అత్యధికంగా వెలువడిన గ్రీన్‌హౌస్ వాయువులే కారణమన్న నిజాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. భూగోళాన్ని రక్షించుకోవాలంటే మనందరం తప్పనిసరిగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు కొన్ని ఉన్నాయి. అవేమిటంటే...''

జగదీశ్‌కి హఠాత్తుగా గుర్తొచ్చింది. ఈరోజు తనను కలుసుకోడానికి సిమెంట్ ఫ్యాక్టరీ ఎమ్.డి. వస్తున్నాడని. గబగబా బ్రష్ చేసుకొని స్నానం వగైరా ముగించుకొని సిద్ధమయ్యాడు. ఆదివారం కావడంతో ఇంట్లోనే ఉండిపోయాడు.

కాస్సేపటికి బయట కారాగిన చప్పుడు. సిమెంట్ ఫ్యాక్టరీ ఎమ్.డి., మరో అధికారి వచ్చారతని ఇంటికి.

''రండి రండి. కూర్చోండి'' అంటూ మర్యాద చేసాడు.

''మా ఫ్యాక్టరీ రెండో యూనిట్‌కి పొల్యూషన్ కంట్రోల్ క్లియరెన్స్‌కోసం...'' డైరెక్ట్‌గా సబ్జెక్ట్‌లోకి దిగిపోయారు టైమ్ విలువ తెలిసిన ఎగ్జిక్యూటివ్స్ కాబట్టి.

''మీ ఫ్యాక్టరీ గాల్లోకి వదిలే పొగల్లో ప్రమాదకరమైన స్థాయిలో కార్బన్ డయాక్సైడ్, రసాయన పదార్థాలు ఉన్నాయని రిపోర్టులో తేలింది. అవి గాల్లోకి చేరితే అట్మాస్పియర్ కలుషితమై పోతుంది. చుట్టుపక్కల గ్రామాల్లో పండే పంటలన్నీ దెబ్బతినే అవకాశముంది. అంతేకాదు. వాతావరణం వేడెక్కి ప్రస్తుతం ప్రపంచమంతటినీ వొణికిస్తున్న గ్లోబల్ వార్మింగ్‌కి కూడా దోహదం చేస్తుంది. అందుకే దాన్ని పెండింగ్‌లో పెట్టాము'' అన్నాడు జగదీశ్.

''మా ఫ్యాక్టరీ ఆ పదార్థాలని గాల్లోకి చేరకుండా ఫిల్టర్ చేయాలంటే లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మీరు కాస్త చూసీ చూడనట్టు ఉన్నారంటే మాకెంతో సహాయం చేసిన వాళ్ళవుతారు'' అన్నాడు ఎమ్.డి. బ్రీఫ్‌కేస్ తెరిచి అందులోంచి ఒక కవర్ తీసి జగదీశ్‌కి అందిస్తూ.

''ఏమిటిది?''

''ఏదో చిన్న కాంప్లిమెంట్. కాదనకండి'' అన్నాడు ఎమ్.డి.

జగదీశ్ కవర్ తెరిచి చూసి సంతృప్తిగా తలాడించాడు. కొద్ది నిముషాలపాటూ మౌనం. గాఢ నిశ్శబ్దం. యావత్ సృష్టి ఆసక్తిగా ఎదురుచూసిన క్షణమది. మరో క్షణంలో

అక్కడ తీసుకోబోయే నిర్ణయం ప్రపంచ గమనాన్నే మార్చివేయగలిగేది. సమస్త జీవరాశి మనుగడనీ నిర్దేశించగల శక్తి గలది...

"మీ ఫ్యాక్టరీ రెండో యూనిట్‌కి క్లియరెన్స్ రెండురోజుల్లో పంపిస్తాను..." అంటూ కవర్ లోపల పెట్టుకున్నాడు జగదీశ్ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.

గుండెలవిసిపోయేలా ఎక్కడో పెద్ద పిడుగుపాటు. ఉన్నట్టుండి లోకమంతా ఆవరించిన కటిక చీకటి!

వచ్చిన వాళ్ళు జగదీశ్‌కి షేక్ హ్యాండిచ్చి కారెక్కి వెళ్ళిపోయారు.

ఆ కారులోంచి కారునలుపు రంగులో బయటికి పొంగుకొచ్చిన పొగ 'వాలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్'ని గాల్లోకి విరజిమ్మాయి. అందులోంచి "ఏరోసల్ స్ప్రే ప్రొపల్లెంట్స్' పైపైకి తేలుతూ, మరింత పైకి లేస్తూ రెండొందల ఇరవై డాబ్‌సన్ యూనిట్ల మందంనుంచి వంద యూనిట్ల మందానికి చిక్కిపోయిన "ఓజోన్ పొర"ని మరింత కృశింపజేయడానికి వెళుతున్నాయి. శూన్యాకాశంలోంచి చొచ్చుకొచ్చే కాస్మిక్ కిరణాలకు మార్గం సుగమం చేసి స్వాగతం పలకడానికి ఎదురెళ్ళుతున్నాయి.

జగదీశ్ లోపలికి వచ్చేసాడు.

కాలుష్య నివారణ సంస్థ అధికారి ఉపన్యాసం టీవీలో ఇంకా వస్తూనే ఉంది. కానీ జగదీశ్ అది వినే మూడ్‌లో లేడు. అతని దృష్టి అంతా మరో పది నిముషాల్లో రాబోయే సినిమా పాటల కార్యక్రమం మీదే ఉంది.

'కళ్ళుండీ చూడలేని, చెవులుండీ వినలేని...'

పాటలు మొదలయ్యాకా పెట్టొచ్చులే అని టీవీ కట్టేసి, టైమ్ పాస్‌కోసం చేతికందిన పాత నవల తీసుకొని చదవ సాగాడు జగదీశ్.

ఆకాశంలో కరి మబ్బులు దట్టంగా కమ్ముకున్నాయి. చిరు మారుతం బలోపేతమై హోరుగాలిగా విజృంభించి వికటాట్టహాసం చేస్తోంది. మహా వృక్షాలు సైతం పూనకం వచ్చిన వాటిలా ఊగిపోతూ భయం గొల్పుతున్నాయి. ఉరుముల, మెరుపులతో కుంభవృష్టి వాన. పెను తుఫానును తలపించేలా పెద్ద రొదతో గాలి. భీతావహులైన పక్షులు గూళ్ళలోకి చేరి దాకున్నాయి. దిక్కుతోచని మూగ జీవాలు, అవి చేసే ఆర్తారావాలు, ప్రచండ వేగంతో వీచే గాలికి తెగి రాలిపడుతున్న లతాకుసుమాలు.

ప్రళయం, ప్రళయం, ప్రళయం.

విలయం, విలయం, విలయం.

విధ్వంసం, విధ్వంసం, విధ్వంసం.

జగదీశ్‌కి భయం వేసింది. నిన్న మొన్నటి రోజున అమెరికాను కుదిపేసిన 'హరికేన్' ఈసారి ఇండియాపై విరుచుకుపడడం లేదు కదా? రీటా, కత్రినాల్లాంటి మరో ప్రళయం ముంచుకు రావడం లేదు కదా? అనుమానం పెనుభూతమై వికృత విరాట్ స్వరూపం దాల్చింది. ప్రకృతి కళ్ళెర్రజేస్తే ఆ విలయాన్ని చూసి తట్టుకొని నిలబడగల గుండె దిటవు అర్భకుడైన మనిషికుందా?

గాలి ఉధృతం తగ్గింది. జగదీశ్ మనసు తీవ్రమైన ఆలోచనల సుడిగుండంలో చిక్కుకుపోయింది. ఆసియాలో లక్షల మంది ప్రజల్ని కబళించిన నిరుటి సునామీ, అమెరికాను అతలాకుతలం చేసిన హరికేన్లు, ప్రతి యేటా వరదలు, కరువు కాటకాలు, భూకంపాలు, ఇసుక తుఫాన్లు... ఏమిటవన్నీ?... ఇవేమీ లేని ప్రపంచం ఉండదా? భూకంపానికీ, భూకంపానికీ మధ్య ఎడం తగ్గిపోతోందేం? వేసవి ప్రతాపం ఏటేటా శృతి మించుతోందేం? ఏమిటిదంతా? ఎందుకు జరుగుతోందిలా?

"అన్నిటికీ కారణం నువ్వే నాయనా!"

గంభీరంగా వినిపించిన ఆ స్వరానికి ఉలిక్కిపడి తల తిప్పి చూసాడు. అప్పుడే ఆన్ చేసిన టీవీ లోంచి వస్తూన్న మాట అది. ఏదో సీరియల్‌లో ఎవరో మరెవరితోనో చేస్తున్న సంభాషణ. సరిగ్గా ఈ సమయంలోనే ఆ మాట వినిపించడం యాదృచ్ఛికమా?... లేక...?!

అశరీరవాణి అప్పుడప్పుడూ అంతరాత్మని ప్రబోధిస్తూ ఉంటుందట. సన్నగా మొదలైన సందేహం స్వల్పకాలంలోనే గాఢ విశ్వాసంగా రూపాంతరం చెందింది. అవును. ఇది ఆకాశవాణి ప్రబోధమే. టీవీ ఒక సాధనం మాత్రమే. పాప పంకిలమైన మనసు భయవిహ్వలతకు లోనవుతుంది. భయవిహ్వలమైన మనసు భ్రమల్ని కూడా నిజమని నమ్ముతుంది. వెంటనే అతని మనసు ఎదురు తిరిగింది.



'నువ్వు నివశిస్తున్న భూమండలాన్ని ఎవరో కాపాడాలని ఎదురు చూస్తున్న వెర్రి వాడా, నీ చుట్టూ జరుగుతున్న విధ్వంసం నీ కంటికి కనిపించలేదా? కళ్ళను కప్పిన పొరలు విచ్చుకోలేదా? కాలాంతకంగా సాగే కరాళనృత్యం కనబడలేదా? ముంచుకొస్తున్న ప్రళయ ప్రభంజనపు హోరు నీ చెవులకింకా సోకలేదా?

'నో నెవర్. దీనంతటికీ నేనెలా కారణమౌతాను? భూమ్యాకాశాల్ని కలిపేస్తున్న ఈ సుడిగాలి ఉధృతానికీ, గదిలో కూర్చొని పుస్తకం చదువుకుంటున్న నాకూ ఏమిటి సంబంధం? అంత పెద్ద విధ్వంసానికి నేనెలా రూపకర్తను కాగలను? అసంభవం. ఈ ఆకాశవాణి కేవలం భ్రమ. చిత్త భ్రమ. అంతే'

ఆకాశం బద్దలేసిందా అన్నంత శబ్దంతో ఉరుము. ఎక్కడో రాలి పడిన మరో పిడుగు. అంతరాత్మ ప్రబోధానికి ఎదురుతిరుగుతున్న అతని మనసు మబ్బుల మంద లింపుతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. భయాందోళనతో బేలగా ఇంట్లోంచే చూసాడు ఆకాశం వైపు.

మబ్బులతని వంక కోపంగా చూస్తున్నట్టనిపించింది. వాటి గర్జన తనను గదమాయిస్తున్నట్టుగా ఫీలయ్యాడు.

"ఎందుకు కాదు? నువ్వే కారణం. ఎందుకీ ఆత్మవంచన? వినాశనానికీ, విధ్వంసానికీ ముమ్మాటికీ నువ్వే కారణం. కార్బన్ డయాక్సైడ్ వల్ల ఓజోన్ పొర డిప్లిషన్, ఓజోన్ పొర డిప్లిషన్ వల్ల గ్లోబల్ వార్మింగ్, గ్లోబల్ వార్మింగ్ వల్ల అంటార్కిటికాలోని ఫర్మాఫ్రాస్ట్ ద్రవీభవనం, ఫర్మాఫ్రాస్ట్ ద్రవీభవనం వల్ల సముద్రంలోకి చొచ్చుకుపోతున్న గ్లేసియర్లు, గ్లేసియర్లు మునకతో ఉప్పొంగుతున్న సముద్ర తలాలు, సముద్ర తలాల పొంగుతో వేలాది గ్రామాల ముంపు, దానివల్ల లక్షలాది ప్రజల జలసమాధి... ఇవన్నీ జరుగుతున్నది నీవల్ల కాదు?"

జగదీశ్ విస్మయంగా చూసాడు మబ్బులవైపు.

'కళ్లు తెరిచి ఒక్కసారి నీ ఎదురుగా ఉన్న ప్రపంచాన్ని చూడవయ్యా' అన్నట్టుగా తోచింది. అప్రయత్నంగా అతని కళ్ళు టీవీ వైపు కదిలాయి. అందులోని దృశ్యాన్ని ఆశ్చర్యంగా చూసాడు.

రోడ్డు పొడవునా కాలుష్యపు పొగని విడుదల చేస్తూ గుంపుగా కదిలిపోతున్న ట్రాఫిక్. కాటలిక్ కన్వర్టర్ల వాడకం లేని వాహనాలు, కరువు కాటకాలకి పరోక్షంగా సాయపడుతున్న సాధనాలు. దూరంగా నల్లని పొగని ఎడతెరిపి లేకుండా మేఘాల్లోకి వదులుతున్న ఫ్యాక్టరీ గొట్టాలు. గ్రీన్‌హౌస్ వాయువుల దగ్గరి చుట్టాలు. పరారుణ కిరణ ఉద్గారాల భోగట్టాలు.

మరోవైపు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరూ లేకున్నా వృధాగా తిరుగుతున్న ఫాన్‌లు. నిరంతరంగా ప్రకాశిస్తున్న లైట్లు. ఖాళీ గదుల్లో కూడా విశ్రాంతి లేకుండా పనిచేస్తున్న ఎయిర్ కండిషనర్లు.

'చూసావుగా. అంతటి కాలుష్యాన్ని అనునిత్యం విరజిమ్ముతున్న నువ్వు ఏరోజైనా చిన్న మొక్కని నాటావా? హరితాన్ని చూసి ఆనందించడమే తప్ప కరిగిపోతున్న ఆ హరితాన్ని కాపాడుకోవాలన్న ఆలోచన నీకెప్పుడైనా కలిగిందా? విద్యుత్ తయారీవల్ల కార్బన్ డయాక్సైడ్ ఉత్పన్నమౌతుందని తెలిసి కూడా ఏనాడైనా దాని పొదుపు గురించి ఆలోచించావా? కిలోమీటర్ లోపు దూరాన్ని దేవుడిచ్చిన కాళ్ళతో నడవగలిగి కూడా ఏనాడైనా నడిచి వెళ్ళావా? సుఖానికి అలవాటు పడిపోతున్నావు. భూమిని గుల్ల చేస్తున్నావు. భూకంపాలు తెప్పిస్తున్నావు. పుడమి జనుల్ని చంపుతున్నావు. నువ్వూ చస్తున్నావు. నీ గొయ్యి నువ్వే తవ్వుకుంటున్నావు. కూర్చున్న కొమ్మనే నరుక్కుంటున్నావు.'

'క్షణికమైన స్వార్థప్రయోజనాలకోసం భావితరాల వాళ్ళ బ్రతుకుల్ని బలిచేస్తున్నావు. నీకు తెలుసో లేదో ఇలాగే మాపైకి పొగ వదులుతూ పోతే కొన్నాళ్ళకి మేము కురిసేది మంచి ముత్యాల్లాంటి వర్షపు చుక్కలని కాదు. చర్మాన్ని కాల్చి బొబ్బలెక్కించే ఆసిడ్ వర్షాల్ని, వర్షంలో తడుస్తూ, ఆనందంగా కేరింతలు కొడుతూ వానా వానా వల్లప్పా అని పాటలు పాడే చిన్నారుల్ని ఇకపై చూడలేవు.'

'మనసుని ఆహ్లాదపరిచే నీలాకాశాన్ని చూడు. మరి కొన్నేళ్ళలో అది కాటుక రంగులో దర్శనమివ్వబోతోంది. శాంతి సందేశాన్ని దాటే శ్వేత కపోతాల్ని చూడు. రాబోయే కాలంలో అవి కనుమరుగు కాబోతున్నాయి. పిండారబోసినట్టు వెన్నెల గుమ్మరించే తెల్లని పున్నమి చందమామ- వేడి గాడ్పులని ఎగజిమ్మే రోజు ఎంతో కాలం లేదు. ఇదంతా నీ తెలివితక్కువతనం వల్ల కాదూ? నీ స్వార్థ సంకుచిత మనస్తత్వం వల్ల కాదూ? దేవుడిచ్చిన అందమైన ప్రకృతిని వికృతంగా మార్చేసే దెయ్యానివి కాబోకు.'

'నువ్వు నివశిస్తున్న భూమండలాన్ని ఎవరో కాపాడాలని ఎదురు చూస్తున్న వెర్రి వాడా, నీ చుట్టూ జరుగుతున్న విధ్వంసం నీ కంటికి కనిపించలేదా? కళ్ళను కప్పిన పొరలు విచ్చుకోలేదా? కాలాంతకంగా సాగే కరాళనృత్యం కనబడలేదా? ముంచుకొస్తున్న ప్రళయ ప్రభంజనపు హోరు నీ చెవులకింకా సోకలేదా? కళ్ళుండీ చూడలేని గుడ్డివాడివి. చెవులుండీ వినలేని చెవిటి వాడివి...' మబ్బుల వాగ్ధాటి అంతకంతకూ అధికం కాసాగింది.

జగదీశ్ ఇక వినలేకపోయాడు. చెవులు గట్టిగా మూసుకున్నాడు. చూసే ధైర్యం లేక కళ్ళు మూసుకున్నాడు. యదార్థాన్ని జీర్ణించుకోలేక లోపలికిపోయి మంచమ్మీద వాలిపోయి ముసుగుతన్ని మళ్ళీ నిద్ర నాశ్రయించాడు.

నిద్రపోతున్న వాడిని పీడకలలే మేల్కొలపగలవు! ★